సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి


బండి రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్

కూకట్‌పల్లి: డివిజన్‌లలో నెలకొన్న వివిధ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఆదివారం మూసాపేట డివిజన్‌లో విస్తృతంగా పర్యటించారు. శ్మశాన వాటికను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. హౌసింగ్ బోర్డు అధికారులు ఈ స్థలం తమదంటూ ప్రహరీ నిర్మించారని దీనిపై స్థానికులు కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రాజీవ్‌గాంధీ నగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. నాలా చాలా ఇరుకుగా ఉండి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిందని స్థానికుల ఫిర్యాదుతో వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి వెండి కవచం బహూకరణ

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధి నిజాంపేట్ రోడ్డులోని సెవెన్ హిల్స్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ పద్మావతి గోదా సమేత, వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం పలువురు దాతలు స్వామివారికి రజత (వెండి) కవచాన్ని పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, ఆలయ ఈవో సత్యనారాయణ చేతుల మీదుగా స్వామివారికి అందజేశారు. వేంకటేశ్వర స్వామి వారికి పీఏసీ చైర్మన్ గాంధీ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతలు సమర్పించిన వెండి కవచాన్ని స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం అలంకరించారు. ప్రసాద్–పద్మిని, బాలు–మంజుల, సాంబశివరావు– ఉషారాణి, ఉమశంకర్–సుజాత వెండి కవచాన్ని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజు, రాగప్రసాద్, పోతుల రాజేందర్, శ్రీహరి, పద్మ, సాంబశివారెడ్డి, అప్పిరెడ్డి, కిరణ్‌కుమార్, కడగియాల శివ, సుజాత, నిఖిల్, భక్తులు పాల్గొన్నారు.


వెండి కవచానికి పూజలు చేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తా


అంబీర్‌చెరువు వద్ద పర్యటిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: కాలనీల్లోని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువు వాకింగ్ ట్రాక్ సుందరీకరణ, చెరువులోకి ప్రగతినగర్ డ్రైనేజీ నీరు వల్ల పేరుకుపోతున్న వ్యర్థాల తొలగింపు పనులను జీహెచ్ఎంసీ ఏఈ రాజీవ్, వాకర్స్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. చెరువులో వ్యర్థాలు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల స్వీకరణ

చందానగర్: శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం నుంచి ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఉప కమిషనర్లు ముకుంద్ రెడ్డి, మోహన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ఒకటి అన్నారు. జంట సర్కిళ్ల పరిధిలో ఉన్న నిరుపేదలకు, ఇళ్లు లేని వారికి నిరంతర ప్రక్రియలో భాగంగా సర్కిళ్ల పరిధిలోని వార్డు కార్యాలయాలలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ఇళ్లు లేని వారు నిరాశ చెందకుండా తమతమ వార్డు కార్యాలయాలకు వెళ్లి దరఖాస్తులు తీసుకొని సమాచారాన్ని పొందుపరిచి అధికారులకు అందజేయాలన్నారు. నిరుపేదలు, ఇళ్లు లేని వారు ఎలాంటి నిరాశ చెందకుండా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వార్డు కార్యాలయాలలో సంబంధిత అధికారులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు.

హెచ్‌సీయూ ఎదుట భారీ ప్రదర్శన



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రధాన గేటు సమీపంలో డప్పుల మోతలతో భారీ ప్రదర్శనను నిర్వహించారు. ఆదివారం డీఎస్‌యూ హెచ్‌సీయూ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఫిబ్రవరి 7న జరిగే 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే ప్రచారంలో భాగంగా ఈ డప్పుల మోత కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎస్‌యూ హెచ్‌సీయూ నాయకులు ఆర్.వేణు, శేఖర్, వర్ధన్, ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మద్దిలేటి మాదిగ, జాతీయ నాయకులు సత్యనారాయణ, శంకర్‌రావు, రాజు, బీఎస్ఎఫ్ అధ్యక్షుడు అంజి అర్రోళ్ల, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు భానుప్రసాద్, శేరిలింగంపల్లి కన్వీనర్ ప్రేమ్‌కుమార్, హెచ్‌సీయూ నాయకులు, ఎంఆర్‌పీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలను పరిష్కరిస్తా

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే పరమావధిగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఆదివారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో గాజులరామారం బాలాజీ లేఅవుట్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చిరెడ్డి, అంజన్న, వెంకట్, శ్రీనివాసులు, కాలనీ వాసులు వేణు, రాజు, సుకుమార్, విజయారెడ్డి, కిషోర్ కుమార్, ప్రదీప్, చైతన్య, ఇంద్రాసేనరెడ్డి పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌తో కాలనీవాసులు

చెరువును సంరక్షించాలని నిరసన


ప్లకార్డులతో చెరువు కట్టపై ర్యాలీ నిర్వహిస్తున్న స్థానికులు

నిజాంపేట్ : ప్రగతినగర్‌లో ఆదివారం స్థానికులు సేవ్ అంబీర్ లేక్ అంటూ కట్టపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 1995వ సంవత్సరంలో ఈ చెరువులో నిలబడి తీసుకున్న ఒక ఫొటోలో మోకాలిలోతు నీళ్లలో కూడా అడుగున ఉన్న మట్టి కనిపించేదన్నారు. అటువంటిది ఇప్పుడు పూర్తిగా చెరువు కాలుష్య కాసారమైందన్నారు. చెరువు చుట్టుపక్కల కూడా జీవులు బతకలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

అర్హులకు పథకాలు అందేనా?

ఇంటి నెంబర్, వార్డులు మారడంతో లబ్ధిదారుల్లో గందరగోళం

మూసాపేట: ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు వస్తున్నాయని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న ప్రజలకు నిరాశ ఎదురుకానుంది. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటికే పలువురి ఇళ్లకు వచ్చి పరిశీలించామని, లబ్ధిదారుల ఫొటోలను తీసుకొని వారి వివరాలను నమోదు చేశామని అధికారులు చెబుతున్నారు. అదే విధంగా రేషన్ కార్డులు కూడా దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి పరిశీలించామంటున్న అధికారులు ఎన్ని దరఖాస్తులు పరిశీలన చేశామని మాత్రం చెప్పటం లేదు. తమ ఇంటికి మాత్రం రేషన్ కార్డు కోసం, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎవరూ రాలేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికే వార్డు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని చెబుతున్న అధికారులు గతంలో ప్రజాపాలన సభల్లో దరఖాస్తు చేసుకున్న సంగతి ఏమైందో చెప్పాలని ప్రజలు ప్రశిస్తున్నారు. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసేటప్పుడు ఆపరేటర్లు తప్పుల తడకగా నమోదు చేయటంతో అర్హులైనా పథకాలు అందడం లేదు. తమ పరిస్థితి ఏంటని అడిగినా అధికారులు పొంతన లేని సమాధానం చెబుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కంప్యూటర్ ఆపరేటర్ల తప్పిదంతో..

ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను కూకట్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లను నియమించి ఆన్‌లైన్‌లో డేటాను నమోదు చేశారు. ఒక్కో ఆపరేటర్‌కు దరఖాస్తుకు ఇంత నగదు అని నిర్ణయించి అప్పజెప్పటంతో వారు ఇష్టం వచ్చిన విధంగా నమోదు చేశారు. ఒక్కో ఆపరేటర్ ఎక్కువ డేటాను నమోదు చేస్తే వారికి ఎక్కువ నగదు వస్తుందని ఇంటి నెంబర్లు, వార్డులు, సెల్ నెంబర్లను తప్పుగా నమోదు చేయడంతో పరిశీలనకు వెళ్లిన అధికారులకు, లబ్ధిదారులకు ఇబ్బందిగా మారింది. ఇంటి నెంబర్ తప్పుగా పడటంతో ఆన్‌లైన్‌లో నమోదు చేసిన ఇంటికి వెళ్లిన అధికారికి ఆ ఇంటిలో ఆ పేరుగల వ్యక్తి లేకపోవటంతో వెంటనే ఆ లబ్ధిదారుడి పేరు పట్టించుకోవటం లేదు. దీంతో ఆ లబ్ధిదారుడు ఇంకా మా ఇంటికి పరిశీలనకు అధికారులు ఎవ్వరూ రావటం లేదని, వస్తారేమోనని ఎదురు చూస్తున్నారు. మళ్లీ దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పటంతో కొత్త దరఖాస్తు ఇవ్వాలా.. వద్దా అన్న సందిగ్ధం ఏర్పడుతోంది. అధికారులు లబ్ధిదారుల పేర్లను కంప్యూటర్‌లో నమోదు చేసుకున్న వివరాలను యాప్ ద్వారా తీసుకురావటం, లబ్ధిదారులు పెట్టుకున్న అప్లికేషన్ ఫారాలను వెంట తీసుకురాకపోవటంతో ఈ సమస్య తలెత్తుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



రేషన్ కార్డు విషయంలోనూ..

రేషన్ కార్డు గురించి స్థానిక కార్యాలయంలో అడగటంతో తమకు తెలియదని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులను సంప్రదించాలని చెబుతున్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులను సంప్రదిస్తే రేషన్ కార్డులు మాత్రం సివిల్ సప్లై అధికారులను అడగాలని చెబుతున్నారు. సివిల్ సప్లై అధికారులను అడిగితే మున్సిపల్ అధికారులే దరఖాస్తులను స్వీకరించారు, వారే పరిశీలిస్తున్నారు, మీ డేటా వారి వద్దే ఉందని సమాధానం చెబుతున్నారు. అధికారుల్లో సమన్వయం లేకపోవటంతో ఇరుశాఖలు ఒకరిపై ఒకరు మావద్ద లేదంటే మా వద్ద లేదని సమాధానం చెప్పటంతో ప్రజలు తమకు రేషన్‌కార్డు వస్తుందా? అసలు ఎవరిని అడిగితే సమాచారం తెలుస్తుందని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

మూసాపేటలోని వార్డు కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించాలి..

మోతీనగర్‌లోని వార్డు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. మూసాపేటలోని ప్రజలు మోతీనగర్‌లో ఉన్న వార్డు కార్యాలయానికి వెళ్లేందుకు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ప్రజా పాలన పెట్టినప్పుడు దరఖాస్తులను మూసాపేట, మోతీనగర్‌లలో స్వీకరించారు. ఇప్పుడు మోతీనగర్‌లోనే దరఖాస్తులను స్వీకరించటంతో మూసాపేట ప్రజలు మోతీనగర్ వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వృద్ధులు, ఉద్యోగాలకు వెళ్లే వారు అంత దూరం వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. మూసాపేటలో ఉన్న వార్డు కార్యాలయంలో కూడా దరఖాస్తులు స్వీకరిస్తే బాగుంటుందని స్థానిక ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని కమల ప్రసన్న నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో హోలిస్టిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద ప్రజల ఆరోగ్యం మెరుగుపడే విధంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వివిధ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శేఖర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ మాధవరం రోజాదేవి

అబాకస్ రాష్ట్ర స్థాయి పోటీలు



కూకట్‌పల్లి: విశ్వం ఎడ్యుటెక్ 18 సంవత్సరాల నుంచి ప్రతి సంవత్సరం అబాకస్, వేదిక్ మ్యాథ్స్‌లో జిల్లా, రాష్ట్ర స్థాయి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలు, ఇంగ్లిష్ స్పెల్ బి రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. అబాకస్, వేదిక్ మ్యాథ్స్‌లో రాష్ట్ర స్థాయి పోటీలను కూకట్‌పల్లి పీఎస్ఎం స్కూల్‌లో ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటకతో పాటు వివిధ జిల్లాల నుంచి 595 పాఠశాలలకు చెందిన 936 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ విద్యార్థులు 18 కేటగిరిల్లో పోటీ పడి 54 మంది విజేతలుగా ఎంపికయ్యారు. విజేతలు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని విశ్వం ఎడ్యుటెక్ సీఈఓ హరిచరణ్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. మధు వారణాసి హాజరై మాట్లాడారు. కార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విశ్వం ఎడ్యుటెక్ టీమ్ తదితరులు పాల్గొన్నారు.

రాణా ప్రతాప్‌నగర్ అధ్యక్షుడిగా మాధవాచారి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ రాణాప్రతాప్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఈ ఎన్నికల్లో ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉండగా ఆకుల వెంకటేష్‌పై సీహెచ్. మాధవాచారి గెలుపొందారని ఎన్నికల అధికారి మార్నేని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు మాధవాచారి మాట్లాడుతూ..కాలనీ అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తానన్నారు. కాలనీ వాసులతో కలిసి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.


మాధవాచారికి నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి


బ్యాగ్ అందజేస్తున్న లయన్ అన్నెం కోటిరెడ్డి

మోతీనగర్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ జూట్ బ్యాగులు వాడాలని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ లయన్ అన్నెం కోటిరెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని పర్వత్‌నగర్ కాలనీ, ఎర్రగడ్డ, సనత్‌నగర్‌లతో పాటు నగరంలో జరిగే వారాంతపు సంతలు, రైతు బజార్‌లలో బట్టతో తయారు చేసిన బ్యాగ్‌లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టిన రోజు, వివాహ శుభకార్యాల్లో కూడా ప్లాస్టిక్‌ను వాడకుండా స్టీల్, అరటి ఆకులు, విస్తరాకులు మాత్రమే వాడాలని సూచించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

ఆల్విన్‌కాలనీ: అంతరించిపోతున్న కూచిపూడి నృత్యకళను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి తెలుగు వారిపై ఉందని సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞ శర్మ అన్నారు. ఆదివారం హైదర్‌నగర్ డివిజన్ ఆదిత్యనగర్‌లోని రుహాని కూచిపూడి డ్యాన్స్ అకాడమీ నిర్వాహకులు నేరెళ్ల కల్పన ఆధ్వర్యంలో మేరా భారత్ మహాన్, సీజన్ 4లో భాగంగా నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రుహాని కూచిపూడి నృత్య అకాడమీ చిన్నారులు తమ అద్భుతమైన నృత్యాన్ని ప్రదర్శించారని కొనియాడారు. కార్యక్రమంలో బిందు మాధవి, భావన, నీల, లిఖిత, రిధి, నిర్వాహకులు సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.


నృత్య కళాకారులతో దైవజ్ఞ శర్మ, నేరెళ్ల కల్పన

అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఆల్విన్‌కాలనీ: గాజుల రామారంలోని మహాదేవపురం కాలనీలోని మతా యోగా అన్నపూర్ణేశ్వరి 25వ వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ గాంధీ ఆదివారం పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దేశాల్, నాయినేని చంద్రకాంత్‌రావు, పరమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



మర్యాదపూర్వక కలయిక

ఓల్డ్‌బోయిన్‌పల్లి: బోయిన్‌పల్లి వ్యవసాయ కూరగాయల మార్కెట్ కమిటీ సభ్యులుగా నియమితులైన నల్లోలా రాజేందర్, అస్లాం సోఫీ ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు అవకాశం కల్పించినందుకు వేం నరేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.


ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డితో రాజేందర్, అస్లాం సోఫీ

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆల్విన్‌కాలనీ: విద్యుత్ సమస్యల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కెవి పలు ఫీడర్‌ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు. శాతవాహన నగర్, హైదర్‌నగర్ గ్రామం, గౌతమినగర్, శ్రీనివాస కాలనీ లేక్ వ్యూ కాలనీ, శుభోదయ కాలనీ, హెచ్ఎంటీ హిల్స్, జేఎన్‌టీయూ పోలీస్‌స్టేషన్, జలవాయు విహార్, అడ్డగుట్ట ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

మూసాపేట: లోధా సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ భీమ లింగప్ప తెలిపారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

కాంగ్రెస్ మహిళా విభాగం డివిజన్ అధ్యక్షురాలిగా నాగరాణి


నియామక పత్రాన్ని అందుకున్న నాగరాణి

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు మొగలి సునీతరావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు జ్యోతి ప్రణవ్ గౌడ్ ఆదేశాల మేరకు వివేకానందనగర్ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పిల్లి నాగరాణిని నియమించారు. ఆదివారం గాంధీ భవన్‌లో నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో విద్య కల్పన ఏకాంత్ గౌడ్, శ్రీదేవి, స్వప్న గౌడ్, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మూసాపేట: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎర్రగడ్డకు చెందిన మచ్చాల రాజశేఖర్(39) ఐడీఎల్ చెరువుపై హానర్స్ భవన నిర్మాణ సంస్థ కార్యాలయం ముందు రోడ్డుపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో రాత్రి 2.30 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లి పోయింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మాతా రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పాతపల్లి శివశంకర్, కర్కా పెద్ద స్వామి, కర్కా రవీందర్ తదితరులు – మూసాపేట

